వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు

ఆశాలకు సూచనలు చేస్తున్న డిఎఫ్‌టి బృందం

ప్రజాశక్తి- అనంతగిరి : గిరిజనులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వద్దని అల్లూరి జిల్లా వైద్యఆరోగ్యశాఖ డిఎఫ్‌టి బృందం ఉన్నతాధికారులు సూచించారు. మంగళవారం మండలంలోని కొండిబ సబ్‌సెంటర్‌ను ఎఎస్‌ఒ కైలాష్, డిఇఒ సతీష్, స్థానిక ఎంపిహెచ్‌ఇఒ నర్సింగరావుతో కూడిన బృందం సందర్శించింది. ముందుగా ఆరోగ్యకేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. హెచ్ఎంఐఎస్, గర్భిణుల రిజిస్ట్రేషన్, వారికి అందుతున్న వైద్యసేవలు, ఐదేళ్లలోపు చిన్నపిల్లలకు అందుతున్న వైద్యసేవలు, ఎంఎల్‌హెచ్‌పి రజని, ఎఎన్‌ఎంవరలక్ష్మి, ఆశాకార్యకర్తలు, ఎపిపిఎస్‌ఒ పనితీరుపై పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు

నేడు 'సికిల్‌సెల్ ఎనీమియా'పై అవగాహన

● రోగులకు నిర్ధారణ పరీక్షలు... సదస్సు

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి పాడేరు: సికిల్‌సెల్ ఎనీమియా నివారణపై ఈనెల 19న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ తెలిపారు. మంగళవారం స్థానిక తలారిసింగి ఇండోర్ స్టేడియంలో సదస్సు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19న ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా నివారణ దినోత్సవం సందర్భంగా ఉదయం 9.30 గంటలకు అంబేద్కర్ కూడలి నుండి ఇండోర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం డిల్లీ నుండి పర్చువల్ విధానంలో సికిల్‌సెల్ ఎనిమియా నివారణపై సదస్సు జరుగుతుందన్నారు. 0 నుండి 40 ఏళ్ల వయస్సు కలిగిన వారికి సికిల్‌సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. 19న ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఐటిడిఎ సమావేశ మందిరంలో సికిల్‌సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల కేంద్రాలలో తాహశీల్దారులు, ఎంపిడి ఓలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సంయుక్తంగా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో 20 వేల మందికి సికిల్‌సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి సికిల్‌సెల్ ఎనీమియా అవగాహన సదస్సును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారులు విఎన్. ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు, తాహశీల్దార్ కల్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ నవీన్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, డిఐఒ డాక్టర్ సాధన, గిరిజన సంక్షేమ శాఖ డిఇఇ. అనుదీప్, సిడిపిఒ ఝాన్సీ, డిఆర్‌డిఎ ఎపిడి. మురళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రీమలి జాన్ పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో చెత్త తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

డ్రైనేజీల్లో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండల కేంద్రంలోని మూడు రోజుల జంక్షన్ గుంటసీమ రోడ్డు వద్ద పూడుకుపోయిన మురుగు కాలువల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై ఈనెల 18న ప్రజాశక్తిలో 'అస్తవ్యస్తంగా మురుగు కాలువలు'- రోడ్డుపై పారుతున్న మురుగునీరు శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్థానిక పంచాయతీ అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని మూడు రోజుల జంక్షన్ వద్ద మురుగు కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్తచెదారాలను మంగళవారం యుద్ధప్రాతిపదికన తొలగించారు. దీంతో స్థానికులతోపాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి నివారించండి

సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్

చెక్కరాయిబందలో తాగునీటి ఇక్కట్లు పరిశీలిస్తున్న ధనుంజయ్

ప్రజాశక్తి- చింతపల్లి :మండలంలోని లంబసింగి పంచాయతీ చక్కరాయిబంధ గ్రామంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామాల సందర్శనలో భాగంగా చక్కరాయిబంద సందర్శించిన స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా గ్రామంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడితో సతమతమైపోతున్నామని, ఊట నీరే దిక్కుగా ఉందని వివరించారు. చెత్తాచెదారం పడి కలుషితమైన ఊటనీటిని తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్ధాలు గడిచిన గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు అమాయక గిరిజనులు ఓటుబ్యాంకుగా చూస్తున్న పాలకులు వారి సమస్యల పరిష్కారంలో మొండిచేయి చూపుతున్నారని మండిపడ్డారు. తక్షణమే చక్కరాయిబందలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తాంబేలి సుబ్బారావు, రాజ్‌కుమార్, క్రాంతి, మహిళలు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి పాడేరు: మండలంలోని డోకులూరు పంచాయతీ, వల్లాపురం గ్రామానికి చెందిన పాంగి అప్పలకొండబాబు మృతి కేసులో నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు సుర్ల అప్పారావు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ఈనెల 4వ తేదీ ఉదయం నుంచి పాంగి అప్పలకొండబాబు కనిపించకపోగా, అతని ఆచూకికోసం గాలించిన బంధువులు, కుటుంబసభ్యులు, ఫలితం లేకపోవడంతో 8న పాడేరు పోలీస్ స్టేషన్లో మృతుని భార్య, కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈనెల 10న అప్పలకొండబాబు మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు మృతదేహాన్ని పాడేరు ఆసుపత్రికి తరలించి శవ పంచనామా జరిపారు. మృతునికి భార్య పాంగి కష్ణకుమారి. ఇద్దరు పాపలు, ఒక బాబు ఉన్నారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్న పోలీసులు, తమనే అనుమానిస్తూ తీవ్రంగా కొట్టారని మతుని భార్య ఆవేదన వ్యక్తం చేస్తోంది. అదే గ్రామానికి చెందిన బోయిని బాలకృష్ణపై తమకు అనుమానం ఉందని చెప్పినా పోలీసులు పట్టించుకోవడం లేదని, తమనే వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని 'ఆహార' బిల్లులు!

- 13 నెలలుగా ప్రభుత్వాసుపత్రుల్లోని రోగుల డైట్ బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- జిల్లాలోని ఏడు ఆస్పత్రులకు రూ.2 కోట్లకు పైగా బకాయి
- అప్పులు చేసి ఆహారం పెడుతున్నామన్న కాంట్రాక్టర్లు
- రోగుల తాకిడితో తలకుమించిన భారంగా డైట్ నిర్వహణ

ఆసుపత్రిలో భోజనం తీసుకుంటున్న రోగి సహాయకురాలు

ప్రజాశక్తి- పాడేరు : అల్లూరి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు ప్రతిరోజూ భోజనం, పాలు ఫలహారాలు అందిస్తున్న డైట్ కాంట్రాక్టర్లకు 13నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో డైట్ నిర్వహణకు అవస్థలు పడుతున్నారు. ప్రతి నెలా చెల్లించాల్సిన డైట్ బిల్లులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో, ఆస్పత్రుల్లో మూడు పూటలా రోగులకు ఆహారం అందించడానికి కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడకతప్పడం లేదు.

పాడేరులోని 420పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రితోపాటు అరకు, ముంచంగిపుట్టు, రంపచోడవరం, కూనవరం, చింతూరు ప్రాంతాల్లోని 50 పడకల స్థాయి వరకు ఏడు ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. గిరిజన ప్రాంతం కావడం, రోగులంతా ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యంపైనే ఎక్కువగా ఆధారపడడంతో ఆయా ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల తాకిడి కూడా అధికంగానే ఉంటుంది. పాడేరులోని జిల్లా కేంద్రం ఆసుపత్రితోపాటు అరకు, రంపచోడవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం వందల సంఖ్యలో రోగులు వైద్యం కోసం ఆస్పత్రులలో ఉండే పరిస్థితి ఉంది. ఆస్పత్రుల్లో చేరే రోగులకు ఉదయం వేళ ఇడ్లీ, లేదా ఉప్మా / రొట్టెతో పాటు పాలు అల్పాహారంగా అందిస్తున్నారు. మధ్యాహ్నం పూట ఒక కాయగూరతో పాటు ఒక గుడ్డు, సాంబారు, అరటిపండు మజ్జిగతో భోజనం, మళ్లీ రాత్రి పూట ఒక కాయకూరతో భోజనం పెడుతున్నారు ఆయా ఆసుపత్రుల్లో రోగులతో పాటు వారికి సహాయకులుగా వచ్చేవారికి కూడా ఆసుపత్రిలో భోజనం అందిస్తున్నారు. కాన్పులకు వచ్చే గర్భిణులతోపాటు బాలింతలకు ప్రత్యేక డైట్ అందిస్తున్నారు. ప్రతి ఆసుపత్రిలో డైట్ కాంట్రాక్టర్ తరఫున నలుగురు నుంచి ఐదుగురు వరకు ఈ భోజన సరఫరా పనులు నిర్వహిస్తుంటారు.

ఈ నేపథ్యంలో రోగులకు నిర్ధేశిత మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం సమకూర్చేందుకు ప్రభుత్వపరంగా ప్రతినెలా డైట్‌బిల్లులు చెల్లించాల్సి ఉంది. అలా వచ్చిన నిధులతోనే డైట్ నిర్వహణలో పనిచేసే సిబ్బందికి ప్రతినెలా జీతాలు చెల్లింపు, రోగులకు నిత్యం మూడు పూటలా ఆహారం సమకూర్చడం వంటి పనులను సంబంధిత కాంట్రాక్టర్లు చేయాల్సి ఉంటుంది.

బిల్లులు అందక డైట్ నిర్వహణకు కాంట్రాక్టర్ల అవస్థలు

అయితే ఏడాదిగా డైట్ బిల్లులు అందకపోవడంతో, ఆసుపత్రిలో రోగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు డైట్ కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి మరీ ఆసుపత్రుల్లో డైట్ నిర్వహిస్తున్నామని వారు వాపోతున్నారు. ఒకరోజు ఒక పేషెంట్‌కు ఆహారం సమకూర్చడానికి ప్రభుత్వం తమకు రూ.76 చెల్లిస్తోందని, ఇప్పటికీ 13 నెలలుగా తమకు డైట్ బిల్లులు అందని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలు ప్రాంతాల ఆస్పత్రుల్లోని డైట్ కాంట్రాక్టర్లు చెబుతున్నారు. నెలల తరబడి ప్రభుత్వ ఆసుపత్రులకు డైట్ బిల్లులు చెల్లించని కారణంగా డైట్ నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

రూ.రెండు కోట్లమేర డైట్ బిల్లుల బకాయి

ప్రస్తుతం అల్లూరి జిల్లాలోని ఉన్న ఏడు ఆస్పత్రులకు చెల్లించాల్సిన డైట్ బిల్లులు మొత్తం రూ.2 కోట్లుకు పైగా బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా డైట్ కాంట్రాక్టర్లు ఆస్పత్రుల్లో రోగులకు అందించిన డైట్‌కు సంబంధించి ప్రతినెలా ఎప్పటికప్పుడు వివరాలతో బిల్లు తయారు చేసి, ఎపి వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్‌కు అందజేస్తున్నారు ఈ విధంగా 2024 ఫిబ్రవరి వరకు డైట్ కాంట్రాక్టర్లు తమ బిల్లులలో సంబంధిత ఆసుపత్రి అధికారితో తయారు చేయించి, సమర్పించారు. 2023 మే నెల నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నెలసరి బిల్లులకు నిధులు విడుదల చేయకపోవడంతో 13 నెలల డైట్ బకాయిలు పేరుకుపోచి. ఆస్పత్రుల్లో డైట్ నిర్వహణ కాంట్రాక్టర్లకు తలకు మించిన భారంగా ఉందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, డైట్ బిల్లు బకాయిలను చెల్లించాలని వారు కోరుతున్నారు.

నిధులు విడుదలయ్యాయి.. త్వరలో చెల్లింపులు

ఆస్పత్రుల డైట్ ఛార్జీల చెల్లింపునకు గ్రాంట్ రిలీజైంది. ఇప్పటివరకు అందిన డైట్ బిల్లులను పరిశీలించి, అప్రూవల్ చేసి పంపించాము. డైట్ బిల్లులను త్వరలో చెల్లిస్తాం. ఇప్పటివరకు వైద్య విధాన పరిషత్ ద్వారా డైట్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ జరుగుతుండగా, దీన్ని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కింద మార్పు చేయడంతో ఇకపై ట్రెజరీ ద్వారా ఆస్పత్రుల్లో డాక్టర్ల జీతాలు, ఆస్పత్రుల డైట్ బిల్లులు చెల్లింపులు జరగనున్నాయి. ఈ మార్పులు, క్రమబద్ధీకరణ వంటి కారణాల వల్ల డైట్ బిల్లులతో పాటు, కొందరు డాక్టర్లుకు వేతనాల మంజూరులో జాప్యం జరిగింది.

డాక్టర్ కె.కృష్ణారావు, జిల్లా కోఆర్డినేటర్, ఎపి వైద్యవిధాన పరిషత్, అల్లూరి జిల్లా

వరద ముంపు పేరుతో పోలవరం నిర్వాసితులను

గ్రామాల నుంచి ఖాళీ చేయించడం మానుకోవాలి

- అన్ని సౌకర్యాలు కల్పించి వరద బాధితులను ఆదుకోవాలి
- వరద సమీక్షా సమావేశంలో సిపిఎం ప్రజాప్రతినిధులు, నేతలు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం సర్పంచ్ పులి సంతోష్‌కుమార్

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని కాపర్ డ్యామ్ వల్ల ప్రతి ఏటా వచ్చే వరదల పేరు చెప్పి పోలవరం నిర్వాసితులను గ్రామాల నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలను మానుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. నిర్వాసిత గ్రామాల్లోని ప్రతి ఒక్క కుటుంబానికి నష్టపరిహారం పూర్తిగా చెల్లిస్తే నిర్వాసితులే స్వచ్ఛందంగా పునరావాస కాలనీలకు వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నారని వారు స్పష్టం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం వరద సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నబాబుతో పాటు సిపిఎం సర్పంచులు పులి సంతోష్ కుమార్, పూనెం సరోజినీ, వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు నేటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూ నష్టపరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సర్వే నేటికీ పూర్తి కాలేదని తెలిపారు. కొండరెడ్డి, ఇతర గిరిజన ప్రజలు భూములు కోల్పోయి నష్టపోతున్నారని, గిరిజనేతర నిర్వాసితులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రాక అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో నిర్వాసితులకు న్యాయం జరగలేదని, ఈ ప్రభుత్వమైనా తక్షణమే గ్రామసభలు నిర్వహించి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న వరదల నుంచి బాధితులను కాపాడటానికి, అన్ని సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా బఫర్ స్టాక్, కిరోసిన్ ముందుగానే సిద్ధం చేయాలని, రామవరం, కుందులూరు, ములకనపల్లి, శ్రీరామగిరి, జీడిగుప్ప, కొల్లూరు, గొందూరు తదితర గ్రామం వరకు బొట్లు ఏర్పాటు చేసి, నిత్యావసరాలు పంపిణీకి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. చింతూరు నుంచి కన్నులూరు మీదుగా కుందులూరు వరకు రహదారి సౌకర్యం, విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. ముందుగా కో-ఆర్డినేషన్ టీమ్‌లు ఏర్పాటు చేయాలని, గత వరదల్లో జరిగిన అవకతవకలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డొంకరాయి కెనాల్ నుండి నీటి విడుదల పెంపు

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి పవర్ కెనాల్‌లో మంగళవారం నుంచి నీటి విడుదల 11 అడుగుల నుంచి 12 అడుగులకు పెంచినట్లు ఎస్ఈ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతులు అనంతరం ఈనెల 10 నుంచి డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి పెంచాలని అధికారులు ఆదేశించడం జరిగిందని చెప్పారు. కెనాల్ పూర్తిస్థాయి సామర్థ్యం 15 అడుగులు అంటే (4,500 క్యూసెక్కులు సామర్థ్యం) మొదటగా 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తూ వస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రిడ్డు అధికారుల ఆదేశాలు మేరకు పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి పెంచడానికి డొంకాయ పవర్ కెనాల్ నుంచి 11 నుంచి 12 అడుగుల వరకు నీటి విడుదల పెంచేయమని పేర్కొన్నారు. కెనాల్ నుంచి ఫోర్ బైకు 3866 క్యూసెక్కులు నీరు విడుదలవుతుందని తెలిపారు. పోల్లూరు జల విద్యుత్ కేంద్రాంలో రెండు యూనిట్లు ద్వారా ఇప్పటివరకు విద్యుత్ ఉత్పత్తి నిర్వహించామని వెల్లడించారు. గ్రిడ్ ఆదేశాల మేరకు మరో యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంచాలన్న అధికారుల ఆదేశాల మేరకు బలిమేల జలాశయం నుంచి ప్రస్తుతం విడుదలవుతున్న 1500 క్యూసెక్కుల నీటిని 3000 క్యూసెక్కులకి పెంచి నీటిని తీసుకుంటున్నామని ఎస్ఈ సివిల్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో ఏపీ వాటి అయిదు టీఎంసీలు దిగువ సీక్రెట్ డొంకరాయ్ జలాశయం అయిదు టీఎంసీలు నీటి నిలువలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

- 2,400 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు
- ఉచితంగా మొక్కల పంపిణీ
- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ఉద్యానవన పంటల ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. గిరిజన రైతులకు ఉద్యాన పంటలకు సంబంధించిన మొక్కలు ఉచితంగా సరఫరా చేసే విషయమై మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో అన్ని మండలాల ఉపాధి హామీ పథకం ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎపిడి, పిహెచ్ఓ, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి, కడియం పరిసర ప్రాంత నర్సరీల యాజమాన్యాలతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీలోని ఏడు మండలాలలో సన్న, చిన్నకారు గిరిజన రైతులకు చెందిన 2,400 ఎకరాల్లో మామిడి, జీడి మామిడి, నిమ్మ, డబ్బా, జాఫర్, మునగ, కొబ్బరి, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలు ఉచితంగా అందజేసే విధంగా అల్లూరి జిల్లా కలెక్టర్ నుండి ఉత్తర్వులు వచ్చినట్లు చెప్పారు. ఈ ఉద్యాన పంటలు వేసుకునే రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కొక్క ఎకరానికి రూ.75 వేలు నుండి రూ.85 వేలు వరకు మొక్కలకు, గోతులు తీసి మొక్కలు పూడ్చుకునేందుకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సచివాలయాల ఆర్టికల్చర్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ ఏపీవోలు ఎప్పటికప్పుడు ఉద్యాన పంటల రైతులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ 2400 ఎకరాలలో ఉద్యాన పంటల మొక్కలు వేసే ప్రక్రియ వచ్చేనెల చివరినాటికి పూర్తి చేయాలన్నారు. నాణ్యమైన మొక్కలు సరఫరా చేయాలని నర్సరీల యాజమాన్యాలను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, పిహెచ్ఓ కె.చిట్టిబాబు, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి యల్.రాంబాబు, ఏపీఓలు ప్రకాష్, సత్యనారాయణ, సురేష్, అరవాలు, రెడ్డి బాబు, స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు, నర్సరీల యాజమానులు పాల్గొన్నారు.

నేడు సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-చింతూరు

ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 19న చింతూరు ఐటిడిఎ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాల్లో సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలో 0-40 సంవత్సరాల లోపు ఉన్న 80,139 మంది గిరిజనులను గుర్తించి, 77,571 మందికి స్క్రీనింగ్ రక్త పరీక్షలు నిర్వహించి, వారిలో 2197 మందిని సికిల్ సెల్ ఎనీమియా అనుమానితులుగా, 76 మందిని సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి గ్రస్తులుగా ప్రాథమికంగా నిర్ధారణ చేసినట్లు పేర్కొన్నారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినంలో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని, స్క్రీనింగ్ పరీక్షలు చేయని వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వాంచాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం అందిస్తున్న వైసిపి నాయకులు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి-రంపచోడవరం

మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం కాగా, కట్టుబట్టలతో రోడ్డున పడ్డ పొట్నేటి దుర్గ ప్రసాద్ రెడ్డికి వైసిపి నాయకులు సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం వైసిపి నాయకులు పరామర్శించి నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. బాధితులకు రావలసిన ప్రభుత్వ సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగ బొజ్జయ్య, వైస్ ఎంపీపీ బాలకృష్ణ, వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ సుధీర్, మాజీ సర్పంచ్ పండా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు ప్రమాద బాధిత కుటుంబానికి...

చింతూరు : మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధి కాటుక పల్లిలో ఆదివారం పిడుగు పడి సోడి నాంచారమ్మ ఇల్లు దగ్ధం కాగా, ఆ కుటుంబానికి జనసేన, బిజెపి నాయకులు మంగళవారం సహాయం అందజేశారు. నాంచారమ్మ కుటుంబానికి బిందెలు, నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు డివిఎస్ఎన్ రమణ రెడ్డి, తీగల రవి, చిలకం కన్నారావు, కారం దుర్గారావు, శివ, పవన్, దూలమ్మ, సవలం వీర్రాజు, సోడి శాంత, తుర్రం కాంతమ్మ, సోడే సత్యవతి పాల్గొన్నారు.

కూటమి నేతల ర్యాలీ

ప్రజాశక్తి-దేవీపట్నం

జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా బుధవారం పదవి స్వీకరణ చేస్తున్న సందర్భంగా దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట గ్రామంలో ఎన్‌డిఎ కూటమి కార్యకర్తలు, కార్యకర్తలు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిల్లలు చేత భారీ కేక్ కటింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

అరకు ప్రజలకు రుణపడి ఉంటా

- ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి- అరకులోయ : తనపై ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన అరకు నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటానని నూతన ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మంగళవారం అరకులోయలోని తన నివాసంలో గిరిజన పాత్రికేయుల బృందం పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనంలోనూ అరకు ప్రాంత ప్రజలు వైసిపిని ఆదరించారని, తనను అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. తను ప్రజాసేవకే అంకితమవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గిరిజన చట్టాలు, హక్కులకు భంగం కలగకుండా పనిచేస్తానని, నిరంతరం ప్రజల పక్షాన ఉండి, సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమన్నారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి వచ్చిన తనను కులమతాలకు అతీతంగా నియోజకవర్గ ఓటర్లు ఆదరించి గెలిపించారని సంతోషం వ్యక్తం చేశారు. వారికి సేవ చేసి రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అరకులోయ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎబిఐ. వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు భీమన్న, సంజీవరావు, లక్ష్మణ్, గోవర్ధన్ ప్రశాంత్ కుమార్, కొండ, భీమా, గిరిజన అడ్వకేట్ ఎస్. ఆనంద్, పాల్గొన్నారు.

పాఠశాల భవనాలు నిర్మించేదెన్నడో..?

- పునాదులు, పిల్లర్లు స్థాయి దాటని నిర్మాణాలు
- నాడు-నేడు నిధులు మంజూరైనా జరగని పనులు
- వసతి లేక కర్లపొదర్ పాఠశాల విద్యార్థుల అవస్థలు
- తక్షణం పనులు చేపట్టాలి : సిపిఎం లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్

పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన పాఠశాల భవన నిర్మాణం

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు : మండలంలోని అతిమారుమూల లక్ష్మీపురం పంచాయతీ కర్లపొదొర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వసతిలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడునేడు నిధులు మంజూరుచేసి, నూతన భవనాల నిర్మాణం చేపట్టినా, అవి పునాదులు, పిల్లర్ల స్థాయి దాటలేదు. దీంతో భవనాల నిర్మాణం పూర్తికాక, పాఠశాల నిర్వహణకు ఇక్కట్లు పడుతున్నారు.
మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కర్లపొదర్ ప్రాథమిక పాఠశాలలో 30మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. అయితే పాఠశాలకు భవనం లేకపోవడంతో రోజుకో పంచన, తాత్కాలిక వసతితో ఇన్నాళ్లుగా కాలం వెల్లదీస్తూ వస్తున్నారు. గతేడాది పాఠశాల భవన నిర్మాణాలకు రూ.38లక్షల నాడునేడు నిధులు మంజూరు కావడంతో వసతి కష్టాలు తీరిపోతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు ఎంతో సంతోషపడ్డారు. మంజూరైన నిధులతో తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు పనులు ప్రారంభమై పిల్లర్లు, పునాదుల స్థాయి వరకు పనులు కూడా చేపట్టారు. ఇంతలో ఏమైందేమో గానీ ఏడాదిగా పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్త భవనాలు అందుబాటులోకి రాని దుస్థితి నెలకొంది. దీంతో యథాలాపంగా వసతి సమస్యతో పాఠశాలను నిర్వహించాలి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.
కాగా నాడునేడు నిధులు మంజూరైన, కర్లపొదర్ పాఠశాల భవనాల నిర్మాణాలు నిలిచిపోవడానికి స్పష్టమైన కారణాలు తెలియడం లేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమో, లేకుంటే చేసిన పనులకు సరిగా బిల్లులు చెల్లింకపోవడమో కారణమని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మంజూరైన నిధులతో పాఠశాల తరగతి గదులు, ఇతర భవనాలను పూర్తి చేయాలని కోరుతున్నారు.

తక్షణమే పనులు ప్రారంభించాలి : సిపిఎం సర్పంచ్ త్రినాథ్

మంజూరైన నాడునేడు నిధులతో అర్థాంతరంగా నిలిచిపోయిన కర్లపొదర్ పాఠశాల భవన నిర్మాణాలను వెంటనే పున:ప్రారంభించి త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలని లక్ష్మీపురం పంచాయతీ సిపిఎం సర్పంచ్ త్రినాథ్ అంటున్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్ రావడంతో పాఠశాల నిర్వహణకు వసతి లేక, విద్యాబోధనకు సరైన నీడ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారన్నారు. శాశ్వత భవనం పూర్తిచేసేలోగా, తాత్కాలిక వసతి కల్పనకు కలెక్టర్, ఐటిడిఎ పిఒ, డిఇఒ, ఇతర విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. నాడునేడు నిధులు మంజూరైన నిర్మాణాలు నిలిచిపోవడానికి కారణాలను గుర్తించి, తక్షణం పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసిమండల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే పాఠశాల భవన నిర్మాణ పనులు ముందుకు సాగలేదని సర్పంచ్ త్రినాథ్ మండిపడ్డారు.

నేరాలు ఘోరాలు

పాము కాటుతో గిరిజనుడు మృతి

సకాలంలో వైద్యం అందకే మృత్యువాత

మృతుడు ఆదయ్య

ప్రజాశక్తి-అనంతగిరి : నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురై, సకాలంలో వైద్య సేవలు అందక గిరిజనుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని ఎన్ఇఆర్ పురం పంచాయతీ . రాయిపాడు గ్రామానికి చెందిన సావు, ఆదయ్య(42) అనే గిరిజనుడు తమ నివాస గృహంలో సోమవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది అర్ధరాత్రి కావడంతో కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం ఆస్పత్రులకు తరలించేందుకు ఎటువంటి ఆస్కారం లేకపోయింది. , మంగళవారం ఉదయం పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌కు సమాచారం అందించగా, వారు స్పందించకపోవడంతో గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఎన్ఆర్ పురం మెయిన్ రోడ్డు వరకు బైక్‌పై వచ్చి, అక్కడినుండి విజయనగరం జిల్లా బొడ్డవరం మెయిన్ రోడ్డు వరకు, తర్వాత అనంతరం విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఆటోలో తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు, పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అంబులెన్స్ కోసం ఎదురుచూస్తున్న సమయంలోనే ఆరోగ్యం పూర్తిగా విషమించడంతో ఆసుపత్రిలోనే ఆదయ్య మృత్యువాత పడ్డాడు.

రోడ్డు, వైద్య సదుపాయాల్లేకే గిరిజనం మరణాలు : సిపిఎం

మన్యంలోని గిరిజన గ్రామాల్లో సరైన రోడ్డు, వైద్యసదుపాయాల్లేక గిరిజనులు మృత్యువాత పడుతున్నారనడానికి ఆదయ్య మరణమే నిలువెత్తు నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె గోవింద్, వార్డు సభ్యులు ఎస్.అప్పలరాజు ఆరోపించారు. సరైన రోడ్డు సౌకర్యంలేక అనారోగ్యం, ప్రాణాపాయ పరిస్థితులున్నా ఆసుపత్రులకు సకాలంలో చేరలేని పరిస్థితి ఉందని, పోనీఇక్కడ సకాలంలో, సరైన వైద్యం అందడం లేదని ఆరోపిస్తున్నారు. ఏజెన్సీలోని మరణాలకు ప్రభుత్వం, అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బాధిత ఆదయ్య కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవడంతోపాటు, తక్షణమే నిలిచిన రోడ్డు పనులను ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

సిఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ విజయసునీత

ముఖ్యమంత్రి దృష్టికి పోలవరం ముంపు పరిస్థితులు

ప్రజాశక్తి -పాడేరు: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి సోమవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలతో కలిసి పోలవరంలో ఏటా తలెత్తుతున్న వరద ముంపు పరిస్థితులపై ఆయనకు వివరించారు.

వరదలు ఎదుర్కోవటానికి సిద్ధం: కలెక్టర్ విజయ సునీత

జిల్లాలోని నాలుగు ముంపు ప్రాంతాలైన చింతూరు, ఏటపాక, విఆర్ పురం, కూనవరం మండలాల్లో వరదలను దుర్కోవటానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఈ నెల ఆరవ తేదీన దీనిపై సంబంధిత అధికారులతో సమీక్షించి, కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. రిలీఫ్, రెస్క్యూ, రిహేబిలిటేషన్ కింద మూడు నెలలకు సరిపడ రేషన్ పంపిణీకి రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అదేవిధంగా, అన్ని శాఖలు పరస్పర సమన్వయ సహకారాలతో పనిచేసి వరదల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రికి కలెక్టర్ విజయసునీత వివరించారు

సామాజిక సేవలో మన్యం విలేకర్లు

మోదమ్మ జాతరలో భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ

ప్రజాశక్తి - హుకుంపేట: మండల కేంద్రమైన హుకుంపేటలో మోదకొండమ్మ మూడురోజుల పండుగ మంగళవారంతో ముగిసింది. ఏజెన్సీతోపాటు మైదాన ప్రాంతం నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన విలేకరుల సంఘం (ఎపిటిఆర్ఎ) హుకుంపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం దాదాపు ఐదువేల మందికి భక్తులకు మజ్జిగ, పులిహోర మంచినీరు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన స్థానిక సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, పత్రికా విలేకర్లు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని, ఇతరులకు ఆదర్శం, ప్రేరణగా నిలవడం ప్రశంసనీయమన్నారు. ఇందులో తనను భాగస్వాముల్ని చేసిన హుకుంపేట మండల విలేకరులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఎపిటిఆర్ఎ పాడేరు డివిజన్ అధ్యక్షులు పి సూర్యారావు మాట్లాడుతూ సంఘం ఆవిర్భావం నుంచి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఏటా శివరాత్రి ఉత్సవాలతోపాటు అడ్డుమండ మత్స్యగుండం, మోదకొండమ్మ జాతరల్లో పాడేరు, హుకుంపేట గిరిజన విలేకర్లు సేవలు అందించారన్నారు. భవిష్యత్‌లో ఇదే ఒరవడి కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిటిఆర్ఎ పాడేరు డివిజన్ సభ్యులు సునీల్, రాజు, వైసిపి గౌరవాధ్యక్షుడు గండేరు చిన్న సత్యం, శ్రీను, పండు, శ్రీను, ఆనంద్, చిట్టిబాబు,గణేష్, నాగరాజు, కొండబాబు, అఖిల్, శివ గంగాధర్, బాలరాజు, వైద్యసిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

పులిహోరను వడ్డిస్తున్న సిఐ, విలేకర్లు

బాధితులను పరామర్శిస్తున్న జమాల్ ఖాన్

ఈదురుగాలుల బాధితులకు జమాల్ ఖాన్ భరోసా

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని విఆర్.పురం రాజుపేట కాలనీ, రేఖపల్లి, వడ్డిగూడెం గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలుల బీభత్సానికి ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ భరోసా కల్పించారు. ఇళ్లు దెబ్బతిన్న విషయాన్ని తెలుసుకున్న ఆయన మంగళవారం ఆయా గ్రామాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. దెబ్బతిన్న ఇంటి పైకప్పు రేకులను బుధవారం నాటికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేస్తామని హామీ ఇచ్చారు. తొలుత మండల తహశీల్దారు సయ్యద్ మౌలానా ఫజిల్‌ను కలిసి బాధిత కుటుంబాల వివరాలు కోరారు. ఈ మేరకు తహశీల్దారు ఆదేశాలతో ఇద్దరు వీఆర్వోలు బాధిత కుటుంబాల సందర్శనకు దోహదపడ్డారు. 16 కుటుంబాలను గుర్తించి, దెబ్బతిన్న వారి ఇళ్లకు రేకులను అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా జమాల్ ఖాన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో దూలయ్య, గ్రామ పెద్దలు సరఫరాజలి, జెకెసి ట్రస్ట్ సభ్యులు షాజహాన్, ఎస్‌కె. రియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీఠంపై కూటమి కన్ను

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి మేయర్ పీఠంపై టిడిపి, జనసేన, బిజెపి కూటమి కన్నేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమి కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జనసేన కార్పొరేటర్లు ముగ్గురు, బిజెపి కార్పొరేటర్ ఒకరు వీరితో పాటు మరో 30 మంది వరకు కార్పొరేటర్లు హాజరైనట్లు తెలిసింది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అధికార వైసిపికి చెందిన పలువురు కార్పొరేటర్లు కూటమి వైపు మొగ్గు చూపుతున్నట్లు సమావేశంలో కొందరు కార్పొరేటర్లు చెప్పారు. కార్పొరేషన్‌లో 98 మంది కార్పొరేటర్లకుగాను 21వ వార్డు కార్పొరేటర్‌గా ఉన్న వంశీకృష్ణ శీనివాస్ తన పదవికి ఈసరికే రాజీనామా చేశారు. ఆయన వైసిపిని వీడి జనసేనలో చేరడం, ఆ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడం జరిగింది. దీంతో కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల సంఖ్య 97కి తగ్గింది. వీరుకాకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా ఓటర్లుగా ఉంటారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం పూర్తయిన తర్వాత మరోసారి కార్పొరేటర్లతో విస్తృత స్థాయిలో సమావేశం జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తీరును ఖండించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 14 సంవత్సరాల క్రితం చేసిన ప్రసంగంపై మేధావి అరుంధతీ రాయ్, కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ షాకేత్ హుస్సేన్‌లను ఉపా చట్టం కింద ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించిన ఢిల్లీ లెఫ్టనెంట్ గవర్నర్ అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజా పౌర సంఘాల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి కన్వీనర్ పి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ కన్వీనర్ కె.పద్మ, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.లలిత మాట్లాడుతూ 2010 అక్టోబర్ 21న రాజకీయ ఖైదీల విడుదల కోసం 'ఆజాది - ది ఓన్లీ వే' బ్యానర్‌పై నిర్వహించిన సదస్సులో అరుంధతీ రాయ్, హుస్సేన్‌తో పాటు మరికొందరు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని పేర్కొంటూ, వారిని ప్రాసిక్యూట్ చేయాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించడం దుర్మార్గం అన్నారు. ఈ చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

ఢామిట్.. కథ అడ్డం తిరిగిందా ?

రుషికొండపై గంటా 'సోలో పెర్ఫార్మెన్స్'పై చంద్రబాబు కస్సుబుస్సు !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రుషికొండపై అత్యుత్సాహం ప్రదర్శించి ఈ నెల 16న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొంతమంది టిడిపి నేతలను, మీడియాను వెంటబెట్టుకుని చేసిన హంగామాపై టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కస్సుబుస్సుమన్నట్లు భోగట్టా. గత జగన్ ప్రభుత్వంలో విశాఖలో నిర్మితమైన 7 సూపర్ స్ట్రక్చర్స్ (భవన సముదాయాలు)కు పర్యావరణ అనుమతుల్లేవని, కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జెడ్) ఉల్లంఘనలు జరిగాయని ఆరోపణలున్న విషయం తెలిసిందే. తాజాగా మరో వివాదం రుషికొండను అలముకుంది. అయితే ఆ వివాదానికి కర్త, కర్మ, క్రియా అంతా గంటాయేనని తెలుస్తోంది. ఆయన 'సోలో పెర్ఫార్మెన్స్' బయట అదిరినా పార్టీలోపల చర్చనీయాంశంగా మారింది.

రుషికొండ భవనాల వద్ద కూటమి శ్రేణులతో గంటా శ్రీనివాసరావు (ఫైల్‌ఫొటో)

అసలేం జరిగింది ?

జగన్ నుంచి అధికారం చేతులు మారిన తర్వాత.. కూటమి పార్టీల అధినేతల సమక్షంలో రుషికొండలో పర్యటించాలన్న ప్రణాళిక మూడు పార్టీలకూ ఉందన్నది తెలిసిందే. నిర్మాణం జరుగుతున్నప్పుడే టిడిపి, జనసేనలు కోర్టులనాశ్రయించాయి. ఆ తరువాత చాలా పరిణామాలే చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతలోనే టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు స్థానిక ఎమ్మెల్యే హోదాలో రుషికొండపైకి జనాలతో వెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా రుషికొండ నిర్మాణాల భాగోతాన్ని బయటపెట్టిన నాయకునిగా హైలెట్ కావడం చంద్రబాబుకు నచ్చలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పత్రికల్లో రెండు రోజుల పాటు పతాక శీర్షికన రుషికొండ కథనాలే రావడంతో అధినేతలు పొందాల్సిన ప్రచారం అంతా గంటాకే దక్కడం కూడా అధినేత కస్సుబుస్సులాడడానికి మరో కారణంగా ఉందని కూటమి పార్టీ నేతల్లో తాజాగా చర్చనీయాంశమైంది. పార్టీ అధినేతలు వెళ్లాక జరగాల్సిన, కూటమికి చెందాల్సిన క్రెడిట్ అంతా గంటా ఒక్కరే వెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం పొందారన్న గుసగుసలు సొంత పార్టీలోనూ వినిపిస్తున్నాయి.

తాళాలు ఎవరిచ్చారని బాబు ఆరా !

'అసలు తాళాలు ఎవరిచ్చారు ? ఎందుకంత మందిని పోగేసుకుని మాకు తెలియకుండా వెళ్లావు' అంటూ గంటా వ్యవహారంపై బాబు కస్సుబుస్సుమన్నట్లు టిడిపి శ్రేణుల్లో తాజాగా చర్చనీయాంశమైంది. చాలాసేపు ఫోన్‌లో మాట్లాడి గంటాను బాబు మందలించారన్నది తెలుస్తోంది. గంటాతో పాటు వెళ్లిన కూటమి నేతలు రుషికొండ భవంతుల్లోని ప్రతి రూమ్, హాల్‌లోనూ సందడి చేశారు. ఆ వీడియోలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసారమయ్యాయి. 'జగన్ మాయామహల్, జగన్ పేలస్' అంటూ పూర్తిగా గంటా శ్రీనివాసరావు పర్యటన ఆద్యంతం లైవ్ వీడియోలు దేశమంతటా వ్యాప్తి చెందడంతో రుషికొండపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. సుమారు రూ.500 కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడితో రుషికొండ భవనాలు నిర్మించారని, వాటిని ఎలా వినియోగించుకోవాలన్న ఆలోచన ప్రభుత్వం చేయనుందని, త్వరలో కూటమి పార్టీల అధినేతలైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన చేసి ఒక నిర్ణయం తీసుకుంటారని గంటా వెల్లడించారు. మున్ముందు ఏం జరుగనుందో చూడాలి.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండండి

క్లినిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. మారుతున్న జీవన శైలి మూలంగా అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు అందరూ ఆరోగ్యం పట్ల అవగాహనతో మెలగాలని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన వి - హెల్త్ కేర్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషాలిటీ వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. అనంతరం వి-హెల్త్ కేర్ డైరెక్టర్ కెఎంకె.రమేష్ మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలు అందరికీ అందించాలనే ఉద్దేశ్యంతో తమ వైద్య బృందం కృషి చేస్తోందని అన్నారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ కె.కమల ఫార్మసీని, కృష్ణ మెటర్నిటీ హాస్పిటల్ ఎమ్‌డి బిఎల్.నారాయణ ల్యాబ్‌ని, వి డెంటల్ హాస్పిటల్స్ ఎమ్‌డి డాక్టర్ జాన్ మాడుగుల డాక్టర్ ఛాంబర్‌ను, ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ ఎ.అప్పల నాయుడు మరో డాక్టర్ చాంబర్‌ను, ప్రముఖ జనరల్ మెడిసిన్ డాక్టర్ ఆర్‌వి.రవి కన్నబాబు నర్సింగ్ విభాగాన్ని, గైనకాలజిస్ట్ జి.శిరీష ఇసిజి విభాగాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పిబివిఆర్.గుప్తా, వి.హెల్త్ కేర్ చీఫ్ చిన్నంకృష్ణ, అడ్మిన్ మేనేజర్ సిహెచ్.పార్వతి, కార్పొరేట్ మేనేజర్ కె.పృథ్వీరాజ్, కె.రమ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, తదితరులు

కార్మిక నేత అప్పలరాజుకు అశ్రు నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అనారోగ్యంతో సోమవారం కన్నుమూసిన విశాఖ జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి అప్పలరాజు అంత్యక్రియలు మంగళవారం అశ్రు నయనాల నడుమ సాగాయి. తొలుత అప్పలరాజు పార్థివ దేహం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శులు బి.జగన్, పి.మణి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సిపిఎం నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, తదితరులు నివాళ్లర్పించారు. అనంతరం సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు అధ్యక్షతన సంతాప సభ జరిగింది. నాయకులు మాట్లాడుతూ అప్పలరాజు జగదాంబ ఏరియా 31వ వార్డు కృష్ణా గార్డెన్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. 25 ఏళ్లుగా సిఐటియు, సిపిఎం సభ్యునిగా సంఘం, పార్టీ విస్తరణకు శ్రమించారని గుర్తుచేశారు. డివైఎఫ్ఐలో పనిచేస్తూ అనేక మంది యువకులను పార్టీలోకి తీసుకొచ్చారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆటో యూనియన్‌ను విస్తరించడానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన భార్య వరుణ మహిళా సంఘంలో పనిచేసారని, తమ్ముడు గణేష్ ప్రస్తుతం విశాఖ జిల్లా ఉపాధ్యక్షునిగా, సిపిఎం జగదాంబ జోన్ కమిటీ సభ్యునిగా పనిచేస్తున్నారని తెలిపారు. కుటుంబం మొత్తం ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి సాగించిందని అన్నారు. అప్పలరాజు మృతి ఆటో కార్మికులకే కాకుండా మొత్తం కార్మికవర్గానికి, పీడిత ప్రజానీకానికి తీరని లోటని తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు పట్ల న్యాయవాదుల హర్షం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయటం పట్ల హర్షం వ్యక్తపరుస్తూ జిల్లా కోర్టు న్యాయవాదులు మంగళవారం కోర్టు సమీపంలో ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి లీగల్ సెల్ ప్రెసిడెంట్ బత్తి రాజశేఖర్ ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, పార్టీ దక్షిణ నియోజవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

తొలుత న్యాయవాదులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నరేంద్ర మోడీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ గిరిధర్, పృధ్వీరాజ్, ఎస్.కృష్ణమోహన్, ఎస్‌వి.రమణ, ఎస్.సతీష్ కుమార్, బాలకృష్ణ, దంతా నరేష్, ఎన్.మాధవరావు, డి.దుర్గాప్రసాద్, కన్నూరు అప్పలనాయుడు, ఎస్.రమేష్ కుమార్, పి.కిరణ్ కుమార్, ఉమామహేశ్వరి, జగదీశ్వరి, కళావతి, బి.మేనా పాల్గొన్నారు.

కెజిహెచ్ నర్సింగ్ స్కూల్‌లో డెంగీ కేసు

- యుద్ధ ప్రాతిపదికన పరిసరాలను శుభ్రపరిచిన అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ నర్సింగ్ స్కూలులో డెంగీ కేసు నమోదైంది. ఓ విద్యార్థినికి డెంగీ ఉన్నట్టు తేలడంతో మంగళవారం అధికారులు అప్రమత్తమయ్యారు. నర్సింగ్ స్కూల్ చుట్టుపక్కల అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను శుభ్రపరిచారు. మురుకుపోయిన డ్రైనేజీలు, మూతల్లేని సింటెక్స్ ట్యాంకులు ఉన్నట్టు గుర్తించారు. జివిఎంసి బయాలజిస్ట్ సాంబశివరావు, జోన్ 4 మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు, మలేరియా విభాగం సిబ్బంది మంగళవారం ఉదయం కెజిహెచ్ అంతా యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రింగ్, మినీ ఫాగింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేశారు. ఎక్కడ చూసినా దోమలే ఉన్నట్టు గుర్తించారు.